

అతను వచ్చే సమయం ఆసన్నమౌతున్న కొలదీ అనూరాధకి ఆత్రుత హెచ్చసాగింది. అది కేవలం ఆత్రుత మాత్రమే కాదు. అందులో భయం వుంది. సంతోషమూ వుంది. ఆవేదనకూడా వున్నది. ఇవేమీ పట్టనట్లు అత్తగారూ ఆమె మనుమడూ పొంగిపోయే సంతోషంతో అతనికి స్వాగతం పలకడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇళ్లు కడిగించారు. రంగులు వేయించారు. తోరణాలు కట్టించారు. రంగవల్లులు దిద్దించారు...అద్దంలా అలంకరించారు. స్టేషన్‌కి వెళ్లడానికి ఏ బట్టలు వేసుకోవాలో తెలియక సతమతమైపోతూన్న కొడుకుని చూసి జాలిగా నవ్వుకుంది అనూరాధ. అతను స్వదేశం విడిచేనాటికి వీడింకా భూమిమీద పడలేదు. ఎన్నడూ చూసి ఎరుగని వ్యక్తి మీద ఎంతో గౌరవం, ప్రేమా పెంచుకుని అతని ఆగమనంకోసం మనస్సంతా కళ్లు చేసుకుని ఎదురుచూస్తున్న ఈ కుటుంబం భవిష్యత్తెలా వుంటుందో? వాడికి అతని నుంచి ఎలాంటి ఆదరణ లభిస్తుందో!

'అమ్మాయ్ అనూరాధా!' త్వరగా తెములూ—అవతల రైలు వేళైంది...' అత్తగారు కేకలు పెడుతోంది. బొంబాయి నుంచివచ్చే రైలు—ఇంకో గంటకి వస్తుంది. కారులో స్టేషన్‌కి వెళ్లడం పది నిముషాలు! ఆవిడ కెందుకూ యింత తొందర!

నానిగాడు బడినుంచి రావడం ఆయిదు గంటలకైతే తనెందుకూ నాలుగుగంటల నుంచీ గడపలో నిలబడడం! అందుకే. అనూరాధ బట్టల బీరువాదగ్గర నిలబడి తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకుని నిట్టూర్పు విడిచింది.

అందానికి తలోకరూ తలోక నిర్వచనం చెబుతారు. ఎవరి కళ్లు చెప్పే భాష్యాన్ని వాళ్లు నమ్ముతారు! తనకేమిటి తక్కువని! తను కట్టుకున్న లేతనీలంరంగు పట్టు చీరెకీ, తన వంటిరంగుకీ తేడా కనిపెట్టగలరా ఎవరైనా! వల్లగా నిడుపైన జడ నాగుబాములా లేదా! తను నాజూకుగా నూటాల్లడదా! సభ్యతగా మెలగదా! ధనం లేదా! ఏమిటి కొరత! కొరత తనలో లేదు అతని మనస్సులో, అతని ఆలోచనల్లోనే వుంది. తనెందుకు ప్రతినిముషం ఆరాటంతో కృంగిపోవాలి! రానున్న పరిస్థితాన్ని ధైర్యంగా ఎదుర్కొనే శక్తి తన కున్నది...తనెందుకు భయపడాలి!

ఆలంకరణ పూర్తిచేసుకునివచ్చి కారులో అత్తగారి ప్రక్కన కూలబడింది అనూరాధ. నానిగాడు డ్రయివర్ ప్రక్కన కూర్చుని డ్రయివింగ్ శ్రద్ధగా గమనిస్తున్నాడు. విజయవాడ పట్టణం బద్ధకంగా నిద్రలేస్తోంది. సోమరితనానికీ, అపరిశుభ్రతకీ రూపం కల్పిస్తే అది విజయవాడ అవుతుందేమోననుకుంది అనూరాధ. అద్దంలోనుంచి చూస్తూ లండన్ న్యూయార్క్ నగరాలు చాలా అందంగా ఎంతో పరిశుభ్రంగా వుంటాయి కాబోలు! అవి చూసిన కళ్లతో విజయవాడలో అడుగు పెట్టిన వాళ్ల అనుభూతులెలా వుంటాయో!

స్టేషన్‌లో పరిచితులు చాలామంది కనిపించారు. అందరూ అతన్ని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన వాళ్ళే. కొందరు పూలమాలలు పట్టుకొచ్చారు. ఎక్కువమంది అతని స్నేహితులు, కొంతమంది బంధువులు. అతనికి బాగా సన్నిహితుడైన స్నేహితుడు ప్రకాశరావు గులాబీపూల దండ చేత్తో పట్టుకొని హడా

వుడిగా తిరుగుతున్నాడు ప్లాట్‌ఫారంమీద. అతనికి అనూరాధపైనా, వానిగాడిమీదా అభిమానం మెండు ప్రతి ఆదివారం ప్రకాశరావు వాళ్ళయింటికి తప్పకుండా వస్తాడు.

'ఈ దండ ఎందుకు తెచ్చావ్ ప్రకాశ్ మామయ్యా'' అంటూ అతని వెంట తిరగడం మొదలుపెట్టాడు నానీ—

'మీ నాన్న కోసమోయ్. అతను రైలు దిగగానే ఈ దండ అతని మెడలోనేసి తప్పట్లు కొట్టాలి—'

'నాకు తెలిస్తే నేనూ తెచ్చేవాడిని—అమ్మ చెప్పలేదు. నాయనమ్మకూడా చెప్పలేదు—' నానీ ముఖం చిన్నబోయింది. దాదాపు కళ్ళవెంట నీళ్ళొచ్చాయి.

'అదేమిట్రా నానీ! ఈ దండ మీ నాన్నకి నీ చేతే వేయిస్తాను—సరేనా!' అన్నాడు. ప్రకాశరావు వాడిని ఎత్తుకొని...నానికి తల్లి మీద కోపం వచ్చినట్లుంది. ఆమెతో అసలు పలకడం లేదు. అనూరాధ నవ్వుకుంది. ముఖంలో ఏ భావమూ కనుపించ నివ్వకుండా గంభీరంగా హుందాగా నిల్చబడింది...జరీపమిట చెంగు భుజం నిండుగా కప్పుకొని ఒకచేత్తో హాండ్‌బ్యాగ్ పట్టుకుని......

ట్రెయిన్ వచ్చింది. జనం పరిగెత్తారు. ఫస్టుక్లాస్ కంపార్ట్‌మెంట్ వాకిట్లో నిలబడి చెయ్యి వూపుతున్న అతన్ని గుర్తించడం కష్టం కాలేదు. దేశం వాతావరణం, ఆహారం యిత్యాది మార్పులు అతనిలో ఏ మార్పు తీసుకురాలేదు. నానీని ఎత్తుకొని ప్రకాశరావు ఆయాసపడుతూ పరిగెత్తి వాడిచేత దండ వేయించాడు. స్నేహితులంతా చుట్టూ మూగారు. అనూరాధ ఒక అడుగు వెనక్కి నిలబడింది. ఆమె అత్తగారు కొడుకుని నిలువునా పరీక్షచేసి కళ్ళల్లోన్నే సంతోషాన్ని నింపుకో ప్రయత్నం చేస్తున్నది. అతను క్రిందికి దిగాడు. నానీ అతనివంక ఆపేక్షగా గౌరవంగా చూస్తున్నాడు.

'నీ కొడుకోయ్' అన్నాడు ప్రకాశరావు రెండు నిమిషాలు - ఆగి నానీని అతనికి అందిస్తూ.

'ఓ...వెరీగ్లాడ్—' అతను నానీని ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు.

'అమ్మ ఎక్కడ?' అని అడగలేదు.

కారు కదిలాక 'నీ వంట్లో యిప్పుడు బాగా కులాసాగా వుంటోందా అమ్మా' అని ప్రశ్నించాడు తల్లిని. స్టేషన్‌లో తనకి కొంచెం ఎడంగా నిలబడి నమస్కారంచేసిన అనూరాధని అతను ఏమీ అడగలేదు. నవ్వి వూరుకున్నాడంతే......

'ఈ గుక్కెడు ప్రాణం నీ కోసమే నిలిచి వుంది. నాయనా!' అంది తల్లి.

అతనింకేమీ అనలేదు. అద్దంలోనుంచి అనూరాధ ముఖం కనపడుతోంది.

గంభీరంగా నిండుగా వుంది ఆ ముఖం. నానీ తన వొళ్ళోనుంచి కదలడం లేదు. చెయ్యి మెడచుట్టూవేసి ఏమిటో అడుగుతున్నాడు. ప్రకాశరావు ఫుల్‌స్టాప్ లేకుండా మాట్లాడుతున్నాడు. అతను వూకొడుతున్నాడు. ఇంటికివచ్చి కాఫీ త్రాగి తన గదిలో పడుకొని నిద్రపోయాడతను. ఆ గది పూర్వంలాగా లేదు. ఏవో కొత్త మార్పులొచ్చినట్లు కనపడ్డాయి. పరిశీలించే ఆసక్తి ఓపికాలేక దిండులో ముఖం దూర్చాడు... నిద్రపట్టేసింది.

'పాపం ట్రెయిన్‌లో నిద్రలేదు కాబోలు రెస్టు తీసుకోవోయ్—' అనేసి ప్రకాశరావు వెళ్ళిపోయాడు.

మళ్ళీ లంచ్‌కి రమ్మని బలవంతంచేసింది అనూరాధ. అతను వంటరిగా ఫీలవడం తనకి మాత్రం ఏం బావుంటుంది!

తండ్రి పనులన్నీ నానీ చకచక చేసేస్తున్నాడు. స్నానానికి టవల్, సబ్బూ అందించడం అన్నీ.

డైనింగ్ టేబిల్‌దగ్గరకూడా ఎంతో ఉత్సాహంగా కబుర్లు చెబుతున్నాడు. ప్రకాశరావు నానీని పొగుడుతున్నాడు. అతనేమీ తినడంలేదు. వ్రేళ్లతో అన్నీ మెలిపెట్టి ప్రక్కకి తోసేస్తున్నాడు. ఆవ పెట్టిన పనస పొట్టుకూర, ఆవకాయ, పప్పుచారు, వడలు, పాయసం- ఒక్కటే అతను తినడంలేదు. ఇవన్నీ పూర్వం అతనికి చాలా యిష్టమని దగ్గరుండి చేయించింది అన్నపూర్ణమ్మగారు.

'మీకు బ్రెడ్ తెమ్మన్నారా?' అన్నది అనూరాధ చివరికి.

'థాంక్స్—నాకేమీ వొద్దు—'

అనూరాధ యింకేమీ అడగలేదు. ఫ్రిజ్‌లో నుంచి ఐస్‌క్రీం పట్టుకొచ్చి యిచ్చింది అదొక్కటే తినేసి లేచిపోయాడతను.

తండ్రి తెచ్చిన టేప్‌రికార్డర్, మూవీ కెమేరా, ట్రాన్సిస్టర్ రేడియో వగైరా అన్నీ చూసి మురిసిపోతున్నాడు నానీ. నానీతోతప్ప ఇంకెవరితోనూ అతను చనువుగా మాట్లాడడంలేదు. గది తలుపులు వేసుకుని ఇద్దరూ ఆడుకుంటూండగా అనూరాధ కాఫీ తీసుకొచ్చి టీపాయ్‌మీద వుంచి అక్కడేవున్న కుర్చీలో కూర్చుంది. అతనికి కాఫీ, నానీకి హార్లిక్స్ యిచ్చి, తను ఏమీ తీసుకోలేదు......

'అమ్మతో మాట్లాడరేం డాడీ!... ఉన్నట్లుండి నానీ వేసిన ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడతను.

'అమ్మ చాలా మంచిది. మీరు రాకముందు అమ్మ నన్ను ఎంతో బాగా ఆడించేది—అమ్మ కాఫీ తీసుకుంటేగాని నేను హార్లిక్స్ త్రాగను—'

'నేనూ, నాయనమ్మా ఇందాకే తీసుకున్నాం—! మీరు కానివ్వండి—' అంది అనూరాధ. అతనేమీ మాట్లాడడంలేదు. ఏమని పలకరించాలో, ఎలా మాట్లాడాలో అతనికి తెలియడంలేదు.

'మీ ప్రయాణం సుఖంగా సాగిందనుకుంటాను—' మర్యాదకోసం అడిగింది అనూరాధ—

'బాగానే సాగింది...నీవు ఆరోగ్యంగా వుంటున్నావనుకుంటా—' అతని మాటలు అతనికే కృత్రిమంగా అనిపించాయి. కిటికీ వైపు తిరిగి, 'వూ' అంది అనూరాధ.

'అమ్మని నువ్వెప్పుడూ చూడలేదా డాడీ!' నానీ మళ్ళీ అడిగాడు.

'ఏం!'

మరిద్దరూ ఎక్కువ మాట్లాడరేం! ప్రకాశ్ మామయ్య నువ్వూ మాట్లాడుకున్నట్లు!'

ఐదేళ్ళ కుర్రవాడికి తనేమీ సమాధానం చెప్పలేకపోతున్నాడు. పావుగంటసేపు కూర్చుని లేచిపోయింది అనూరాధ. అతను విదేశాల నుంచి తిరిగి వచ్చిన సందర్భంగా సాయంత్రం చిన్న టీ పార్టీ జరుగనున్నది. అన్నీ అమర్చడంలో లీనమైంది ఆమె...డాబామీద కుర్చీలూ టేబిల్సూ వేయించి, లైట్లు పెట్టించింది. నానీ తండ్రిపట్టుకొచ్చిన కొత్త సూట్ వేసుకున్నాడు. అనూరాధ లేత ఆకుపచ్చ జరీచీరెకట్టి, సిగ పైకిచుట్టి సన్నజాజులు తురిమింది. ఆమె సహాధ్యాయినులు పదిమంది వచ్చారు. అతని స్నేహితులు వారి భార్యలు పిల్లలు!

కరుణాకరం అదృష్టాన్ని పొగడుతూ పద్యాలు చదివాడొకాయన. కరుణాకరం

ఇంటిదీపం

పుట్టగానే విదేశాలు వెడతాడనుకుందట ఒకావిడ. పొగడ్తలుతప్ప ఏమీ వినపడడం లేదు అక్కడ. అనూరాధ అతిథి మర్యాద చేస్తున్నది. కరుణాకరం తండ్రి రామమూర్తిగారు ముచ్చటపడి చేయించిన సింహాసనంలాంటి కొయ్యకుర్చీలో కూర్చుని వేడుకచూస్తున్నది అన్నపూర్ణమ్మగారు. అయిదేళ్లుగా ఆమె మోస్తూవచ్చిన భారం నేటికి ఆమె భుజాలపైనుంచి దింపుకోగలిగింది. ఈ ఇల్లు, ఆస్తి, అనూరాధా, వానిగాడూ అన్నీ కరుణాకరానివి. అతనివి అతనికి అప్పగించేస్తే తనకేమిటి కచింత! రెండు సంవత్సరాలలో తిరిగి వస్తానన్న కరుణాకరం అయిదు సంవత్సరాలు రాకపోయేసరికి ఆమె మూగగా అనుభవించిన బాధ కొలిచేశక్తి భగవంతుడికి సైతం లేకపోయింది. అనేక శంకలు, అనుమానాలు ఆమె మెదడు చుట్టూ నిత్యమూ పరిభ్రమించేవి. ఒక్కడే కొడుకు! మరి జీవితంలో అతనితో కలిసి బ్రతికే యోగ్యత వున్నదో, లేదో! పాశ్చాత్య దేశపుస్త్రీలు నవనాగరికులు, జాణలు—అని విన్నది. ఎవరినైనా వివాహమాడి అక్కడే వుండి పోతాడేమో కొడుకు. అనేది ఒకటే పురుగులా మనస్సుని తొలిచివేసేది.

కానీ అలా జరుగలేదు కరుణాకరం ఒక్కడే తిరిగివచ్చాడు. టీపార్టీ అయి అందరూ వెళ్లాక కొడుక్కి దిష్టితీసి పోసింది. వానిగాడికీ అనురాధకి కూడా తీసింది డాబా మీద సన్నజాజితీగెలకి మొగ్గలు తొడిగాయి. మాలతి విరబూసింది. తొట్లలో ఏవో పూలు పగలబడి నవ్వుతున్నాయి. 'తన ఇల్లు కలకలలాడుతోంది.' అనుకున్నాడు కరుణాకరం. ఇన్నిరోజులుగా తను వేగానికీ, యాంత్రిక జీవనానికి అలవాటుపడ్డాడు. ఇక్కడ అంతవేగం లేదు. నిలిచి ఊపిరి పీల్చుకోవచ్చును. అస్తమానూ వాతావరణం గురించి మాట్లాడే వాళ్లిక్కడ లేరు. మాటల్లో ఆప్యాయత తొణికిసలాడుతోంది. భోజనాలయ్యాక నానీ, అన్నపూర్ణమ్మగారి దగ్గర పడుకుని నిద్రపోయాడు. అనూరాధ కూజాతో మంచినీళ్లు తీసుకుని డాబామీద తనకోసం సిద్ధంచేసిన గదిలోకి వచ్చింది. అది అమ్మ బలవంతం అని కరుణాకరం గ్రహించాడు. అతని మెదడులో పూర్వ స్మృతులు మెదిలాయి అప్పుడూ ఇలాగే! అనూరాధని అలంకరించి బలవంతంగా గదిలోకి త్రోసి బయట గడియ వేసేది.

అమ్మ! అనూరాధ జాలిగా నవ్వేది. కిటికీపైపు జరిగి వొదిగిపడుకుని నిద్ర నటించేవాడు తను. అనూరాధ వచ్చి తన భుజంమీద చెయ్యివేసి, 'మీరు విశ్రాంతిగా పడుకోండి' అంటూ సోఫాని ప్రక్కలాగా తయారుచేసుకుని నిద్రపోయేది. అందుకే అనూరాధంటే ఒకవిధమైన గౌరవం వుండేది తనకి. ఆమె చాలామంది స్త్రీలలాంటిదికాదు. ఆత్మాభిమానం ఎంతవుందో ఇతరులను అంతే గౌరవిస్తుంది. వాళ్ల అభిప్రాయాలను మన్నిస్తుంది. మంచినీళ్ల కూజా బల్లమీద పెట్టి సోఫాకంబెడ్‌మీద దిళ్లువేసుకుని, ఏదో పుస్తకం తీసుకుంది అనూరాధ. అతను కిటికీలోనుంచి బయటికి చూస్తున్నాడు. వెన్నెలతెల్లగా, మరీ తెల్లగా పూలవానలాగా కురుస్తోంది. సీలింగ్‌ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతోంది. గడియారంచేసే చప్పుడుతప్ప మరేం వినపడడంలేదు.

అనూరాధ దీక్షగా చదువుతోంది.

ఆమెతో ఏదో చెప్పాలనిపించింది. ఏమీ చెప్పలేకపోయాడు. పుస్తకం మూసివేసి ఆమె నిద్రపోయేవరకూ అతనేమీ చెప్పలేకపోయాడు. నిద్రలోకూడా అనూరాధముఖం శాంత గంభీరంగా వుంది. ధ్యానాల కతీతమైన మహాయోగిని ముఖంలా వుంది. ప్రక్కమీద ఒత్తిగిలిపడుకుంటే ఎదురుగా గోడకి తండ్రి ఫోటో వ్రేలాడుతూ కనపడి, గతం మనస్సు చుట్టూ తిరిగింది

రామమూర్తిగారంటే చాలామందికి పెద్ద పులిని చూసినట్లే వుండేది. పరిచయస్థులకీ, బంధువులకీ, పాలంచేసే రైతులకే కాదు, ఆఖరికీ అన్నపూర్ణమ్మగారికీ, కరుణాకరంకికూడా మెలి తిరిగిన మీసాలతో రౌద్రమూర్తిలావుండి, కోపంవస్తే హుంకరించే వాడాయన. ఒక్కడే కొడుకైనా కరుణాకరానికి గారాబం పెట్టలేదు. భార్య అన్నపూర్ణమ్మగారు ఆయనకి పరాయిది కాదు మేనమామ కూతురే. అయినా ఆయన ఆవిడకి రవ్వంత చనువుకూడా యివ్వలేదు.మల్లెపూల దగ్గర్నుంచి మువ్వల వడ్డాణంవరకూ ఆయనే కొనాలిగాని ఆవిడకు పైసఖర్చుచేసే స్వాతంత్ర్యం వుండేదికాదు. అయినా ఆవిడకేలాంటి లోటూ రాలేదు. ఆవిడ మనస్సులో ఏ చిన్నకోరిక కదిలినా కనిపెట్టి పెదవివిప్పి అర్థించకుండానే తీర్చేవాడాయన ఆవిడ కట్టని రకం చీరెలూ, ధరించని సొమ్ములు లేవంటే అతిశయోక్తికాదు. కరుణాకరంకీ ఏ లోటూ వుండేదికాదు. అయితే బడికి వెళ్ళకపోతే పెద్దశిక్షపడేది. ఆ విషయంలో రామమూర్తిగారి మనస్సు కరిగేదికాదు. ఒక్కకొడుకైనా నిర్దాక్షిణ్యంగా శిక్షించేవారు. అందుకే కరుణాకరం ప్రతిక్లాసులోనూ ఫస్టువొచ్చేవాడు. వాళ్లు పొంచి చదివేవాడు. వేళపట్టున తిని నిద్రపోయేవాడు స్కూల్ ఫైనల్‌వరకూ తండ్రికి ఎదురు చెప్పవలసిన అవసరం కరుణాకరంకి కలుగలేదు. ఆయన కుట్టించిన బట్టలు ధరించడం, అమ్మపెట్టిన భోజనంతిని బడికి వెళ్ళడం—ఇవే తప్ప ఫలానాది కావాలనీ, ఫలానాదివద్దనీ అతను ఎప్పుడూ చెప్పలేదు. ప్రతిశనివారం రామమూర్తిగారే కుటుంబాన్నంతనీ సినీమాకి తీసుకుని వెళ్లేవారు. అంచేత రహస్యంగా సినీమాకి వెళ్లే అగత్యంకూడా కరుణాకరంకి లేదు

స్కూల్‌ఫైనల్ చదువుతూండగా జరిగిన ఈ సంఘటన అతని జీవితాన్నీ, ఆలోచనా పధాన్నే మార్చివేసింది

తనకి బాగా గుర్తు...ఆ రోజు ఆదివారం. వర్షాకాలం కాబోలు ప్రొద్దుటినుంచీ వర్షం కుండపోతగా కురుస్తున్నది ఎక్కడికీ వెళ్లడానికి లేక ఇంట్లోనే కూర్చున్నాడు తను పన్నెండు గంటలవేళ టెలిగ్రాం వచ్చింది.

వెంకట్రామయ్యగారికిసీరియస్‌గావుందట. వెంటనే బయలేరాలని వెంకట్రామయ్యగారు రామమూర్తిగారికి చాలాదగ్గర స్నేహితుడు. ఆయనకి రెండోపెళ్లి భార్యకూడా చనిపోయింది మొదటి భార్య సంతానం పెద్దవాళ్లై పెళ్లిళ్లుచేసుకుని వెళ్లిపోగా, రెండవ భార్య కూతురుమాత్రం ఆయన దగ్గరే వుండిపోవలసివచ్చింది. ఆ పిల్లకప్పుడు పన్నెండేళ్లు. ఫోర్త్‌ఫారం చదువుతోంది. తనకన్న నాలుగేళ్లు చిన్నది.

వెంకట్రామయ్యగారు ఎక్కడికివెళ్లినా ఆ పిల్లను తీసుకునివెళ్లేవారు కూతురంటే ఆయనకి ఆరో ప్రాణం. ఆ పిల్లకి ఆరో ఏట కాబోలు తల్లి గతించింది. అప్పటినుంచీ ఆయనే తల్లీ తండ్రీఅయి పెంచుతున్నారు. మొదటి భార్య కొడుకు లిద్దరూ

పెద్దవాళ్ళూ బాగానే సంపాదించుకుని దర్జాగా జీవిస్తున్నారు. అయినా ఆయన ఎన్నడూ కూతుర్ని వాళ్ళ యిళ్ళకి పంపలేదు. ఆయనకు తరచూ గుండెనెప్పి రావడంమూలాన ఆస్తి సంతటినీ ఏనాడో విల్లువ్రాసి పంచేశారు. ప్రస్తుతం ఆయన పేర పదెకరాల మాగాణి వుంది. పల్లెటూళ్ళో చక్కని డాబా వుంది ఆ రెండూ ఆయన తదనంతరం కూతురికి వస్తాయి. వెంకట్రామయ్యగారి సుస్తీమాట వినగానే టాక్సీలో బయల్దేరారు రామమూర్తిగారు. ఆ వూరు బెజవాడకి యాభై మైళ్ళుంటుంది 'కరుణా, నువ్వుకూడా పద—' అంటూ కొడుకునికూడా బయల్దేరదీశారు

'అక్కడికి వాడెందుకూ క్షురవేధవ! జడుసుకోడానికా!' అంటూ అడు తగిలింది అన్నపూర్ణమ్మగారు

క్షురవేధవేమిటి పదహారేళ్ళొస్తేనూ— జీవితాన్ని చూడం నేర్చుకోవాలి' అని కొడుకుని చెయ్యిపట్టుకుని టాక్సీ ఎక్కించారు రామమూర్తిగారు. టాక్సీ ఆ వూరు చేరేసరికి నాలుగు గంటలైంది. ఇంటినిండా బంధువులున్నారు. వాకిట్లో డాక్టర్‌గారి కారుంది. పొలంచేసే రైతులు, పనివాళ్ళు అందరూ కన్నీళ్ళు తుడుచుకుంటున్నారు ఇంకా వర్షం కురుస్తూనేవుంది. నాలుగు గంటలకే బాగా చీకటిపడినట్లయింది. గదులలో దీపాలు వేశారు వెంకట్రామయ్యగారికింకా స్పృహ వున్నది. నీరసంగా మాట్లాడుతూనేవున్నాడు. కొడుకు లిద్దరూ కుర్చీలు వేసుకుని చెరొక వైపునా కూర్చున్నారు కూతురు దిగాలుగా తండ్రి కాళ్ళదగ్గర కూర్చున్నది.

'అదుగో నాన్నా రామమూర్తిగారువచ్చారు' అన్నాడు పెద్దకొడుకు తమని చూసి లేచి నిలబడి. వెంకట్రామయ్యగారి కళ్ళు సంతోషంగా మెరిశాయి. రామమూర్తిగారువెళ్ళి కుర్చీలో కూర్చుని ఆయన చెయ్యిపట్టుకున్నారు.

'నీ కోసమే. .' అన్నారు వెంకట్రామయ్యగారు చాలా నీరసంగా...

'నీకేం ఫరవాలేదు' రామమూర్తిగారు ఊరడించారు. కరుణాకరం తండ్రి వెనక నిలబడ్డాడు.

'పాపని గురించే నాకు దిగులు...దాన్ని నువ్వు—తీసుకెళ్ళాలి ..'

పాపని రమ్మని సంజ్ఞ చేశాడు. ఆమె వెళ్ళి దగ్గరగా నిలబడింది. ఆమె చేతులు రామమూర్తిగారి చేతిలో పెట్టారు కన్నీళ్ళు ధారలు కట్టాయి. పెద్దకొడుకూ, చిన్నకొడుకూ, కోడళ్ళూ ముఖాలు చూసుకున్నారు. కోడళ్ళిద్దరూ మూతి విరిచారు. బంధువులు ఆశ్చర్యం ప్రకటించారు.

ఇద్దరు కొడుకులు వుండగా ఎవరో పరాయి వ్యక్తికి అప్పగించడం ఏమిటి చిన్నపిల్లని!

ఆయన భార్య సవ్యంగా చూస్తుందా!

ఆ ఇంట అప్పుడెవరూ మాట్లాడలేదు వెంకట్రామయ్యగారి ప్రాణం మరి రెండు రోజులకుగానీ పోలేదు. ఈ రెండు రోజులూ ఆయన బంధువుల సూటీపోటీలు భరిస్తు అక్కడే వుండిపోయారు రామమూర్తిగారు. ఆయనతోపాటు కరుణాకరం. అతనికి అదివరకు శవాలంటే తగని భయంగా వుండేది. వెంకట్రామయ్యగారి మృతదేహాన్ని చూస్తూ వుంటే ఏ భయమూ కలుగలేదు. వెంకట్రామయ్యగారి అంత్యక్రియలూ, కర్మకాండా అయిపోయిన తరువాత లాయర్ అందజేసిన వీలునామాను, పాపనూ తీసుకుని ఇంటికి వచ్చారు రామమూర్తిగారు.

కరుణాకరం మళ్ళీ అనూరాధ వంక చూశాడు...ఆమె నిశ్చింతగా నిద్రపోతున్నది. మళ్ళీ గతాన్ని త్రవ్వడం మొదలుపెట్టాడు. పదిరోజులుగా తిండీ నిద్రాలేని పాప కారులో పడుకుని అలసటగా నిద్రపోతూ వుంటే ఆమె తల వొళ్ళో పెట్టుకుని కూర్చున్నారు రామమూర్తిగారు. పాపముఖం అమాయకంగా వుంది.

'ఈ పిల్ల ఇకనుంచీ మనకు పరాయిది కాదు. కరుణాకరాన్ని ఎలాచూస్తానో పాపను కూడా అలాగే చూడాలి నువ్వు—ఏమాత్రం లోటు కనిపించినా నేను సహించను' అని ప్రకటించి పాపను అన్నపూర్ణమ్మగారికి అప్పగించారు. పాప స్కూల్లోచేరి చదువుతోంది. అన్నపూర్ణమ్మగారిని అత్తయ్యా అంటుంది. ఆయన్ని మామయ్యా అంటుంది. కరుణాకరాన్ని ఏమీ అనదు. అతనికెందుకో పాపంటే ఎక్కువ యిష్టం వుండేదికాదు. ఎవరోపిల్ల తమ యింట్లోవుండి సర్వహక్కులూ అనుభవించడం ఏమిటనిపించేది. ఆమెని పిలిచే వాడు కాదు. పలికేవాడు కాదు.

అతని దృష్టి ఎప్పుడూ చదువుమీద వుండేది. ఇంజినీరింగ్ చదవాలని, ఫారిన్ వెళ్ళాలనీ, కీర్తీ, ధనమూ ఆర్జించాలనీ, ఇలాకలలు కనేవాడు

స్కూల్ ఫైనల్ పరీక్షలు చాలా సంతృప్తికరంగా వ్రాశాడు కరుణాకరం. వేసవిలో రామమూర్తిగారికి బాగా జబ్బు చేసింది. నెలరోజులు మంచంలోనుంచి లేవలేదు. ఆ జబ్బు ఆయన ఆలోచనలమీద బాగా పని చేసింది పత్యం తీసుకున్న వారం రోజులకి ఎవరికీ చెప్పకుండా పురోహితుడిని పిలిచి కరుణాకరం పెళ్ళికి ముహూర్తం పెట్టమన్నారాయన. 'పెళ్ళికూతురు ఎవరూ?' అని ఆశ్చర్యంగా అడిగింది అన్నపూర్ణమ్మగారు.



వాయిదాల చెల్లింపు పై ట్రాన్సిస్టర్

రు. 250/- విలువగల ఫిలిప్స్ 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ నెలకు



రు. 25/- వంతున వాయిదాలపై చెల్లించి పొందండి. వివరాలకై నేడే వ్రాయండి

BRITAIN AGENCIES,
(WAPM) P.B 1232, Delhi-6.

ఫైరింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్స్ అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస వినోదాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది. ఆటోమేటిక్ 50 షాట్లు ఏర్పాటు కలదు. తేలికైనది. దీని నుండి వెలువడు నిప్పు రవ్వలు మిమ్మును కాపాడును.

ధర: 50 షాట్లు జర్మన్ మోడల్ నెం. 99 రు.15/50 వి.పి.పి. చార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు.3/50. అదనపు షాట్లు 100కి రు. 5/-

INDUSCO (WAPM-15)
Beat No. 13 Aligarh



ఇంటి దీపం

'పాప!' అన్నారు రామమూర్తిగారు. అన్నపూర్ణమ్మగారు ఏమీ అనలేదు. ఆ౦డ అన్న కూతురు విశాలని కరుణాకరంకి చేసుకోవాలని చాలాకాలంగా అనుకుంటూ వుండేది. విశాల కన్న పాప అందంగానే వుంటుంది. పాపకి ఆస్తి వున్నది గుణవంతురాలు. అంతకన్న కావలసిందేవుంది! ఈ వార్త విని ఎగిరి పడ్డాడు కరుణాకరం! పదహారేళ్ళకి పెళ్ళేమిటన్నాడు. పాపంటే తన కిష్టం లేదన్నాడు. ఇంకా ఎన్నో అన్నాడు. వారంరోజులు భోజనం చేయకుండా సత్యాగ్రహం చేశాడు. అతనిమాట ఎవరూ వినిపించుకోలేదు. అనుకున్న ముహూర్తానికి కరుణాకరం పెళ్ళి అయి పోయింది

*　　*　　*

'ఇవాళ సినిమాకి వెడదాం డాడీ!' అన్నాడు నానీ మూడురోజుల తరువాత. కరుణాకరంకి ఏమీ తోచడంలేదు. నానీ ఒక్కడే అతనికి కాలక్షేపం నానీని విడిచి నిమిషంకూడ వుండలేక పోతున్నాడతడు. నానీకి తెలుగు సినిమాలంటే యిష్టం. కరుణాకరం తెలుగుసినిమా చూసి ఎన్నాళ్లో అయింది.

'అలాగే వెడదాం' అన్నాడు.

నానీకి టాయిలెట్ చేసి పంపింది అనూరాధ, అతనూ తయారయ్యాడు. బయలు దేరబోతూండగా, మరి అమ్మో! ఆవిడని పిలూ! అమ్మ లేకపోతే నేను రాను... అని మొండికేశాడు వాడు. అనూరాధనికూడా పిలవాలని అతనికి తోచలేదు.

'సరే వెళ్ళి పిలుచుకురా!' అన్నాడు.

'నువ్వే పిలు.. నేను పిలవను' మూతి ముడుచుకుని గారంచేశాడు.

వాడి మొండితనం కరుణాకరంకి తెలుసు. నెమ్మదిగా లోపలికివెళ్ళి గదులన్నీ వెదికాడు. వంటయింట్లో కూర్చుని వంటావిడచేత ఏదో వండిస్తున్నది అనూరాధ. స్నానంచేసి మామూలు చీరె ధరించింది. అతన్ని చూసి లేచి నిలబడి ఏంకావాలని అడిగింది,

'నిన్ను సినిమాక్కి రమ్మని బాబు గోల చేస్తున్నాడు...రాకూడదూ?'

అనూరాధ విస్తుబోయింది! ఒక్కక్షణం ఆలోచించి, 'పదండి' అని తన గదిలోకి వెళ్ళి చీరె మార్చుకుని వచ్చింది.

తన వివాహమైన యిన్ని సంవత్సరాల తరవాత మొట్టమొదటిసారిగా ఆమె ప్రక్కన కూర్చుని సినిమా చూస్తూ, తనకు అనూరాధపైగల అయిష్టానికి కారణాలు వెదకసాగాడు కరుణాకరం...'

హైదరాబాద్, బెంగుళూర్ నగరాల్లో అందమైన అమ్మాయిలో పరిచయం అయింది. అందులో సునందా, హేమమాలినీ చాలా సన్నిహితులయ్యారు. అయితే ఏం, వాళ్ళల్లో తనకేదో లోటు కనిపించింది. తనకు ఒక్క అనూరాధపైనేకాదు వివాహం అంటేనే ఏదో వైముఖ్యం. దానికి కారణం బాల్యవివాహం కావచ్చు, తన యిష్టానికి వ్యతిరేకంగా చేయడంవలన కావచ్చు. తండ్రి పైన కోపం కావచ్చు. నిజానికి అనూరాధకేం లోటని!

సినిమా చూస్తున్నంత సేపూ కరుణాకరం ఆలోచిస్తూనే వున్నాడు.

విదేశాల్లో ఎంతోమంది స్త్రీలు పరిచయం అయ్యారు అక్కడి వివాహవ్యవస్థ నచ్చలేదు కరుణాకరంకి వాళ్ళని గౌరవిస్తూ ఎప్పుడూ దూరంగానే వుంచేవాడు. అప్పుడప్పుడు అనూరాధ జ్ఞాపకం వచ్చేది. అయినా ఒక్క ఉత్తరం వ్రాయాలని కూడా అనిపించేదికాదు. అమ్మకి వ్రాసేవాడు. నానిగాడిక్షేమం మాటవరసకి అడిగేవాడు. అందులో అనూరాధ ప్రసక్తి లేదు. అనుకున్న దానికన్న ఎక్కువ చదువుకొన్నాడు. ఆశించిన డిగ్రీకన్న విలువైన డిగ్రీ సంపాదించ గలిగాడు అయినా అతనికేదో లోటు కన్పిస్తూనే వుంది.

సినిమానుంచి తిరిగి వచ్చాక పాలుత్రాగి నానీ నిద్ర పోయాడు యథాప్రకారం అనూరాధ మంచినీళ్ళు తీసుకుని గదిలోకి వచ్చి సోఫాపైన పడుకుంది. భోజనాల దగ్గర కూడా ఆమె ఎక్కువ మాట్లాడలేదు. కరుణాకరం నిద్రకోసం వ్యర్థంగా ప్రయత్నిస్తున్నాడు.

సోఫామీద పడుకున్న అనూరాధ కెందుకో తన వివాహంనాటి సంగతులు గుర్తుకొచ్చాయి.

*　　*　　*

జబ్బుతో అవస్థపడుతూ కూడా తనపై ఎంతో శ్రద్ధ తీసుకుంటూన్న రామమూర్తి గారిని చూస్తే తనకి చాలా గౌరవంగా వుండేది.

ఎప్పుడూ ఆయన మంచం దగ్గరే కూర్చుని సేవచేయా లనిపించేది. స్కూల్‌కి వెళ్ళకపోతే ఆయన కోప్పడేవారు.

'నేనులేనా పాపా! నీకెందుకు శ్రమ! స్కూల్‌కి వెళ్ళమ్మా!' అనేది అన్నపూర్ణమ్మగారు...

అన్నపూర్ణమ్మగారు తనని ఎంతో ప్రేమగా చూసేది. ఆ రోజు 'కరుణాకరంకి పాపనిచ్చి పెళ్ళి చేస్తాను' అని రామమూర్తిగారు ప్రకటించిన రోజుకూడా ఆవిడ చాలా నిబ్బరంగా ప్రవర్తించింది. తనని దగ్గరకు తీసుకుని చెంపలు నిమిరింది.

కరుణాకరం ప్రసక్తి చూసి భయపడి పోతూ 'అతని కిష్టంలేని ఈ పెళ్ళి ఆపెండి' అని చెప్పాలని ఎంతో ప్రయత్నించింది తను. కానీ నోట మాట రాలేదు. కరుణాకరం అంటే తనకి చాలా యిష్టంగా వుండేది. అతను తనని ఛీదరించుకున్నా, తనతో పలక్కపోయినా, అతనంటే కోపం వచ్చేదికాదు. ఎంతో అభిమానించేది. అతను తనకి భర్త కావడం తనకి సంతోషమే కలుగజేసింది. పన్నెండేళ్ళ పిల్లకి అంతకన్న ఏం తెలుస్తుంది! పీటలమీద అతను ముఖం అంతా చిన్నబుచ్చుకుని కూర్చోడం, తను వినేటట్లు ఏవో అనడం, కాలికి అడ్డంవచ్చిందల్లా తన్నడం, అవన్నీ అప్పుడు తనకేమీ మనస్సుకి పట్టలేదు. పట్టులంగాలు, జరీ వోణీలు, నగలు, విందుభోజనాలు, అనేక మంది బంధువులు, హాస్యాలు, వినోదాలు— తన కెంతో సంబరంగా వుండేది.

వేసవి వెళ్ళిపోయింది. కరుణాకరం కాలేజిలో చేరాడు ఇంటర్మీడియట్‌లో. వాళ్ళిద్దరికీ స్నేహం కలపాలని అన్నపూర్ణమ్మగారు తంటాలు పడేది. ఒకేసారి భోజనం వడ్డిస్తే లేచిపోయి భోజనం తన గదిలోకి తెమ్మనేవాడు. రెండేళ్ళు అలాగే గడిచి పోయాయి. కొత్తబట్టలు కొనుక్కోడం, స్నేహితురాళ్ళతో కలిసి చదువుకోడం, గృహావరణలో పూలమొక్కలు పెంచడం యివీ తన నిత్యకృత్యాలు...అప్పుడప్పుడూ తండ్రి జ్ఞాపకం వచ్చేవాడు. చాలా దిగులని పించేది. ఎవరో స్నేహితురాలు వచ్చి కబుర్లు చెబుతూంటే దిగులు మర్చిపోగలిగేది. స్కూల్ ఫైనల్ మంచి మార్కులతో పాసయింది తను. అతనికి ఇంటర్‌లో క్లాసు రావడం బి. ఇ.లో సీట్ రావడం జరిగాయి. ఇంటినుంచి వెడుతూ అతను చాలా సంతోషం వెలిబుచ్చాడు. అతన్ని వొంటరిగా కలుసుకుని ఏదో చెప్పాలని, తనకి ఒక్క ఉత్తరం వ్రాయమని అడగాలని ఎంతో తపించింది. ఆ అవకాశం తనకి చిక్కనేలేదు. సామానుతో అతని కారు సాగి పోతూవుంటే డాబామీదనుంచీ చూసి కళ్ళు తుడుచుకుంది. అతను తన కెంతో ఆప్తుడైనట్లు, అతని వియోగం తను భరించ లేనట్లు అనిపించింది. ఎవరికి కావాలి తన వేదన! ఆ ఆవేదన అక్కడికక్కడే అణగారి పోయింది.

రామమూర్తిగారు తననీ కాలేజీలో చేర్పించారు. మరి నాలుగు సంవత్సరాలు అలాగే గడిచిపోయాయి. సెలవులకి వచ్చినా తన వంక చూసేవాడేకాదు కరుణాకరం. స్నేహితురాళ్లెవరైనా వచ్చి, 'మీ ఆయన్ని పరిచయం చేస్తే అరిగిపోతావుటోయ్' అనేవాళ్ళు. యాంత్రికంగా పరిచయంచేసేది. అతను నమస్కారం పెట్టి 'నాకు పనుందండి' అంటూ వెళ్ళిపోయేవాడు.

బి. ఇ. అయిపోయి ఇంటికి సెలవులకి వచ్చిన కరుణాకరం తండ్రి మరణాన్ని చూడ వలసివచ్చింది. తుదిఘడియల్లో ఆయనేమీ ఎక్కువ చెప్పలేదు. 'పాపని నీకు అప్పగిస్తున్నాను. దాన్ని అన్యాయం చెయ్యకు.' అన్నారు, అంతే.

రామమూర్తిగారి మరణం అనూరాధను కృంగదీసింది. ఆ ఇంట్లో యింక తన సంగతి పట్టించుకొనేది అత్తగారే! ఆవిడే దిగులుతో కృశించిపోతున్నది. ఇంక తన నెవరు ఊరడిస్తారు! కరుణాకరం చాలా గంభీరంగా వుండేవాడు. తల్లిని కూడా ఎక్కువ ఓదార్చేవాడు కాదు. అనూరాధే అన్నపూర్ణమ్మగారిని కనిపెట్టి వుండేది.

ఎం. ఇ.లో సీట్ సంపాదించుకొని వెళ్ళిపో బోతున్న కొడుకుని ఆటకాయించి 'ఇన్నాళ్ళుగా వాయిదాలు వేస్తూ వచ్చావు—ఈ శుభకార్యం కాస్తా కానిచ్చి వెళ్ళు—' అని ఒట్టుపెట్టుకుంది తల్లి...

గుమ్మాలకు తోరణాలు కట్టించింది. అందరినీ భోజనాలకి పిలిచింది. అనూరాధకి కొత్త చీరెకట్టి మల్లెపూల జడవేసింది. సెంటు రాచింది. గదిలోకి పంపి బయట గొళ్ళెం వేసింది. కరుణాకరం చిక్కుల్లో పడిపోయాడు. ఇలాంటి అవాంతరం వచ్చి పడుతుందని అతను అనుకుంటూనే వున్నాడు. తల్లి ఆసలే దిగులుపడి వున్నది. కృశించి పోతున్నది. పైగా బెదిరిస్తున్నది. ఆవిడ మాట తలదాల్చక తప్పలేదు.

అనూరాధ లోపలికి వచ్చి చాలాసేపు సోఫాలో కూర్చున్నది. చివరికి సోఫాని పడక లాగా తయారు చేసుకుని నిద్ర పోయింది. అతన్ని పలకరించలేదు. వేడుకోలేదు. ఏడవ లేదు. ఇవ్వన్నీ ఆశించి నిద్రనటిస్తున్న కరుణాకరం ఆశ్చర్యపడ్డాడు.

మూడు రాత్రులూ ముళ్ళమీద ఉన్నట్లు గడిపేసి వెళ్ళిపోయాడు కరుణాకరం. ఎప్పు



ఇంటిదీపం

జైనా సెలవులకి వస్తే మళ్ళీ ఇదే తంతు. భోజనం కూడా అనూరాధే వడ్డించేది. తల్లి అతనిదగ్గరకే వచ్చేదికాదు. బి. ఏ. పూర్తి చేసి అన్నపూర్ణమ్మగారికి తోడుగా ఇంట్లోనే వుండి పోయింది అనూరాధ. అతను వస్తున్నాడంటే ఇద్దరికీ సంతోషంగా వుండేది. అన్నపూర్ణమ్మగారి ఆరోగ్యంకూడా బాగుండడంలేదు. మనవడో, మనవరాలో పుడితే చూసి చనిపోవాలని ఆవిడ కోరుకుంటూ వుండేది. అనూరాధ తలలో స్వయంగా మల్లెచెండు తురిమి మనసులో దీవించేది ప్రతి రోజూ. ఆమెకి కొడుకూ కోడలూ గడుపుతూన్న బ్రహ్మచారి జీవితం సంగతి తెలియదు. ఎం. ఇ. కూడా పూర్తిచేసి విదేశాలకు వెళ్ళడానికి ప్రయత్నిస్తూన్న కొడుకుని ఆవిడ బ్రతిమిలాడింది. చదివినంతవరకూ చాలన్నది. తన కళ్ళెదుటవుండి ఏదైనా ఉద్యోగం చెయ్యమన్నది. మనవడికోసం ఆవిడ కలవరించని రోజంటూ వుండేది కాదు. కోడలిని, కొడుకుని స్నేహితులను చెయ్యాలని విడరాని జంటగా బంధించాలని ఎంతో ప్రయత్నించేది...

రోజూలాగే ఆరోజూ అనూరాధ మంచి నీళ్ళు కూజా తీసుకుని మేడమీదకు వచ్చింది. తెల్లని జరీపువ్వులున్న తెల్లరంగు బెనారస్ పట్టుచీరె కట్టి తెల్లనిజాకెట్టు వేసుకుంది మెడలో ముత్యాలదండ, చెవులకి రవ్వల దుద్దులు, తలలో మల్లెచెండు. చల్లగా తెల్లగా మబ్బుతునకలా వచ్చింది. ఈ అలంకారం అంతా అమ్మ పిచ్చేనని కరుణాకరంకి తెలుసు. లేకపోతే 'నిద్రపోవడానికి ఇంత ఆడంబరమా?' అనిపించింది.

అనూరాధ చాలా మంచిది, బొమ్మలా కూర్చుని అమ్మచేత అలంకారం చేయించుకుంటుంది, తనని బాధించదు. గది బయట సన్నగా వర్షంతుంపర పడుతోంది. చల్లని గాలి చలిగాలిగా మారుతోంది. ఆలోచనల్తో కరుణాకరం బుర్ర వేడెక్కిపోతున్నది అనూరాధకి తను అన్యాయం చేస్తున్నాడనిపించింది తండ్రిపైన కోపంతో ఒక అమాయకురాలిని బాధించడం తగదనిపించింది. జాలి హృదయాన్ని కదిలించసాగింది. దానికి వాతావరణం తోడైంది. అతను లేచి అనూరాధ దగ్గరగా వచ్చాడు. భుజంమీద చెయ్యివేసి తనవైపు తిప్పుకున్నాడు. గడ్డం పైకెత్తి 'అనూరాధా' అన్నాడు. బయట వర్షం జోరు ఎక్కువైంది. ఉరుములు, మెరుపులూ ఎక్కువైనాయి. అనూరాధ అతని గుండెపై తల ఆన్చి వెక్కివెక్కి ఏడవడం సాగించింది. ఎన్నో చెప్పాలనే కోరిక వుంది.

ఆమె అసహాయతవెక్కిళ్ళరూపందాల్చింది అతను ఆమె కళ్ళు తుడిచాడు. నుదుటిమీద ముద్దుపెట్టుకుని మంచం దగ్గరకు తీసుకుని వెళ్ళాడు. 'నేను ఓడిపోయాను — ఓడిపోయాను — నువ్వే గెలిచావు.' అని గొణుక్కున్నాడు.

తెల్లవారింది. అతనికి అనూరాధ ముఖం చూడాలనిపించలేదు. కాఫీ తాగి సూట్‌కేసు సర్దుకుని 'అమ్మా నేను బెంగుళూరు వెడుతున్నాను. పది రోజుల్లో వస్తాను' అని వెళ్ళిపోయాడు.

అతనికి విదేశాలు వెళ్ళడానికి స్కాలర్‌షిప్పు వగైరాలన్నీ వచ్చాయి. ప్యాస్‌పోర్టులూ అవీసంపాదించుకొనడానికి నెలరోజులుపట్టింది. నెల రోజులు తిరిగి తిరిగి ఇంటికి వచ్చాక ఆ రోజు ప్రొద్దున్నే అనూరాధ బాత్‌రూం దగ్గర వాంతి చేసుకోడం చూశాడు.

అతని మెదడులో మెరుపులాంటి ఆలోచన మెరిసింది. తన బలహీనతవలన అమ్మకోరిక తీరుతున్నది కాబోలు! ఇంక తను నిశ్చింతగా వెళ్ళవచ్చు.

భోజనాలదగ్గర అమ్మ చెప్పింది 'అమ్మాయిని డాక్టరుకి చూపించు నాయనా — ఈ మధ్య ఏమీ కులాసాగా వుండడం లేదు' అని.

లేడీ డాక్టర్‌ని ఇంటికి పిలిచారు ఆవిడ చెప్పింది అనూరాధ అంతర్వత్ని అయిందని. అమ్మ ముఖంలో వెయ్యిదీపాలు వెలిగాయి.

'మీరు వెడుతున్నారు—నా కెప్పుడైనా ఉత్తరం రాయకూడదూ?......'అనడిగింది అనూరాధ బొంబాయి ఎయిర్‌పోర్టులో... నవ్వుతూ తల వూపాడు.

నానీ పుట్టినప్పుడు అనూరాధ మొట్టమొదటిసారిగా అతనికి ఉత్తరం వ్రాసింది. జవాబు రాయాలని కూర్చుంటే కలం సాగలేదు—వ్రాయడం—చింపడం — చివరికి వ్రాయనేలేదు...

* * *

కరుణాకరం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగానికి ప్రయత్నం చేస్తూ వుండిపోయాడు నెల రోజులు — నెలరోజుల్లో నానీ అతనికి బాగా చేరువవడమేకాదు, అనూరాధనికూడా ఎంతో దగ్గరకు తెచ్చాడు.

రోజూ షికారుకి తీసుకెళ్ళమని వేధించేవాడు. బయలుదేరాక అమ్మ రానిదే కదలనివ్వనేవాడు. ఇద్దరూ కలిసివస్తేగాని ఊరుకునేవాడుకాదు.

ఆ రోజు అనూరాధ ఏనిమిదైనా నిద్ర లేవలేదు. నానీ వచ్చిలేపితే మూలిగింది. అన్నపూర్ణమ్మగారు నుదురు పట్టుకుచూసి 'బాబోయ్—వొళ్ళు కాలిపోతున్నది. డాక్టరుకి కబురుచెయ్ నాయనా?' అన్నది. నానీ తల్లిచుట్టూ తిరుగుతున్నాడు.

తల్లికేదైనా సుస్తీచేస్తే వాడికి క్షణం తోచదు. పాలైనా త్రాగకుండా తల్లిదగ్గరే కూర్చున్నాడు. వాడు పాలు త్రాగకపోవడం కరుణాకరంకి బావుండలేదు. అతను కాఫీకప్పు అక్కడే వదిలి డాక్టర్‌కోసం పరిగెత్తాడు. డాక్టర్ వచ్చి ఇంజక్షనిచ్చేవరకూ అనూరాధ మూలుగుతూనే వుంది ఇంజక్షనిచ్చిన అరగంటకి కళ్ళుతెరచి చూసి కాఫీ త్రాగింది. వెంటనే పాలుత్రాగాడు నానీ—తండ్రిని కాఫీ త్రాగమని బలవంతం చేశాడు. అమ్మ అన్నం తినకపోతే తనూ తిననని మొండికేశాడు. వాడితోపాటే అనూరాధ గదిలో కూర్చుని ఆమె అడిగినప్పుడల్లా గ్లూకోజ్ నీళ్ళు యిస్తున్నాడు కరుణాకరం. చంటివాడి అవస్థచూస్తే అతనికి చాలా బాధగావున్నది. అనూరాధకి త్వరగా నయమైతే బాగుండుననిపించింది

అతనికి భోజనం సయించలేదు మందులు కూడా అతనే యిస్తున్నాడు జాగ్రత్తగా. ఆమె నోట్లో టాబ్లెట్‌వేసి, నీళ్ళుపోస్తే మింగుతున్నది. అనూరాధ జ్వరం వారం రోజులుకిగానీ తగ్గలేదు. ఈ వారంలో నానీ తండ్రిచేత బాగా సపర్యలు చేయించాడు తల్లికి. వాడు చిక్కిపోయి సగమైనాడు...

'అనూరాధా—కొంచెం హార్లిక్స్ త్రాగకపోయావా! ఈపూట మందువేసుకున్నావా! నువ్వేం పనిచెయ్యకు' ఇలా కరుణాకరం చెబుతూంటే అనూరాధేకాదు అన్నపూర్ణమ్మగారు కూడా ఆశ్చర్యపడ్డది.

'అమ్మకి తగ్గితే తిరపతి వస్తానని దండం పెట్టాను డాడీ. మనందరం తిరపతి వెళ్ళాలి' అన్నాడు నానీ.

'ఎప్పుడు పెట్టావోయ్ దండం?'

'నాయనమ్మ పెట్టమంది... పెట్టాను. అమ్మకి తగ్గిందిగా.'

కరుణాకరంకి (మొక్కులమీద నమ్మకం ఎప్పుడూ లేదు. చాలా మొండిగా వాదించే వాడు దేవుడి ఉనికిని గురించి.

నానిగాడిమాట (తోసిపుచ్చడం కూడా అతని కిష్టంలేదు. అనూరాధ జ్వరం తగ్గినందుకు అతనికీ సంతోషంగానేవుంది. ఒక వారంరోజులు నానితో కులాసాగా గడిపనూ వచ్చు. అందుకని సరే నన్నాడు.

'మీరు వెళ్లండి నాయనా — నేను రాలేను' అన్నది అన్నపూర్ణమ్మగారు.

తిరుపతి, కంచి, కాళహస్తి, మద్రాసు, మహాబలిపురం, బెంగుళూరు, మైసూర్ అన్నీచుట్టి ఇంటికి బయలుదేరుతూ, మైసూర్‌లో అనూరాధకి పట్టుచీరె ఒకటి కొని, 'అందరూ ప్రేమించి పెళ్లాడ నంటారు. పెళ్లాడిన ఏ యువతినైనా ప్రేమించాలని కొందరంటారు. అసలు ప్రేమ అంటే ఏమిటో నాకు తెలీదు— కానీ ఇప్పుడిప్పుడే నిన్ను చూస్తే నువ్వు నాదానివనీ, నాకెంతో కావలసినదానివనీ అనిపిస్తున్నది అనూరాధా! నీకో చీరె కొనాలని ఇవాళే అనిపించింది' అన్నాడు కరుణాకరం. అనూరాధ హుందాగా నవ్వింది ఆ హుందాతనమే కరుణాకరంకి యిష్టం. యాత్రలన్నీ అయి ఇంటికి వచ్చాక కొడుకూ కోడలూ, ఆప్యాయంగా మాట్లాడుకోడం, చమత్కారాలు, చెణుకులూ విసురుకోడం చూసి 'నేను ఇన్నేళ్లుగా సాధించాలనుకున్నది. నువ్వు రెండునెలల్లో సాధించావ్ నానీ అందుకే మనవడు కావాలని ఎంతో కలవరించాను మనదేశంలో ఎన్నో సంసారాలు పిల్లల మూలంగా నిలుస్తున్నాయి. అదే మనకీ విదేశీయులకీ తేడా. ఆపేక్షలూ, అంతఃకరణలూ హృదయంలోనుంచీ పుట్టుకు రావడానికి పిల్లలు కారణం అంటే ఎంత గర్వంగా వుంటుంది!' అనుకుంది అన్నపూర్ణమ్మగారు.

నానికివేవీ తెలియవు. అమ్మా, నాన్నా నవ్వుతూ మాట్లాడుతూవుంటే వాడి కళ్లు కోటిదీపాల వెలుగులు విరజిమ్ముతాయి. వాడి కళ్లల్లో వెలుగు అనూరాధ జీవితానికి పూలబాట! వాడే ఆ ఇంటికి దీపం!

ఆంధ్రసచిత్రవారపత్రిక

వనితాలోకం వ్యాసరచన పోటీ

(ముగింపు తేదీ 16-9-1967)

మొదటి బహుమతి ... రు. 200

రెండవ బహుమతి ... రు. 150

మూడవ బహుమతి ... రు. 100

ఇవి కాక అయిదు రు. 50 కన్సొలేషన్ బహుమతులు!

13—10—1967 ఆంధ్రసచిత్రవారపత్రిక, దసరాసంచిక, వనితాలోకం ప్రత్యేక సంచికగా వెలువడుతుంది.

ఈ సందర్భంలో 'వనితాలోకం వ్యాసరచన పోటీ' ఒకటి నడుపుతున్నాము

పోటీ వ్యాసం వస్తువుగా, నేడు మనదేశం ఎదుర్కొనే అతి ముఖ్యసమస్య అయిన జనాభాసమస్యని ఎన్నుకున్నాము. జనాభా పెరుగుదలని అరికట్టకపోయినట్లయితే మనదేశం చాలా కష్టాలని ఎదుర్కొనవలసివస్తుందని నిపుణులు అంటున్నారు దీనిని గుర్తించి మన ప్రభుత్వం 'కుటుంబ నియంత్రణ'కి సంబంధించిన పథకాలను అన్నివిధాలా అమలుపరచాలని ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా ప్రజల అంగీకారం, సహకారం అత్యవసరం

నేటి పరిస్థితులలో కుటుంబ నియంత్రణ పథకాలు, ఉద్యమాలు ఎటువంటి ఆవరోధాలని, సమస్యలని ఎదుర్కొంటున్నాయి? ఈ పథకాలు, ఉద్యమాలు ఎంతవరకు విజయవంతం కాగలవు? అవి విజయవంతం కావడానికి సామాన్యప్రజలు, ప్రత్యేకంగా వనితలు వహించవలసిన పాత్ర ఏమిటి?

ఈ ప్రశ్నలకి సరయిన సమాధానాలు కొంతవరకు స్త్రీలే ఇవ్వగలరేమో అనిపిస్తుంది అందుచేతనే ఈ వ్యాసరచన పోటీని వనితాలోకం శీర్షిక క్రింద నడుపుతున్నాము రచయిత్రులందరూ సహకరించి ఈ పోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము

ఈ కింది పట్టికలో భారతదేశం జనాభా పెరుగుదలకి సంబంధించిన వివరాలు స్థూలంగా ఇవ్వబడ్డాయి. సంవత్సరం సుమారు 'పంటసంవత్సరం', అంటే జూన్ చివరికి అనుకోవచ్చు. జనాభా అంకెలు కోట్లు.

సంవత్సరం.........	1964	1976	1986
జనాభా	47 2	64.8	85.6

నిబంధనలు 1. ఈ పోటీలో వనితలు మాత్రమే పాల్గొనవచ్చు. 2 వ్యాసాలు స్వంత రచనలు అయిఉండాలి ప్రతి వ్రాతప్రతితోనూ రచయిత్రి వ్యాసం తన స్వంత రచన అని హామీ ఇవ్వాలి 3 వ్యాసాలు 3 (మూడు) అరఠావు (అంటే ఎకరు యిజా పేజీకీ రెండు రెటు కల) పేజీలు మించరాదు 4 కాగితానికి ఒక వయిపునే సిరాతో రాయాలి 5 రచయిత్రి పూర్తి పేరు, చిరునామా వ్యాసం చివర రాయాలి వేరే కాగితం మీద రాసి జతపరచరాదు 6 కవరుమీద 'వనితాలోకం పోటీ!' అని స్పష్టంగా రాయాలి. 7 రచనలు సంపాదకుడు, ఆంధ్రసచిత్రవారపత్రిక, 7, తంబుచెట్టి స్ట్రీట్, మదరాసు—1కి పంపాలి 8 రచనలు మా కార్యాలయానికి 16-9—1967 లోగా చేరాలి. 9 రచనలు ఎట్టి పరిస్థితులలోనూ తిప్పి పంపబడవు అందుచేత రచయిత్రులు తమ రచనలతో స్టాంపులు, స్వంత చిరునామాల కవర్లు పంపరాదు 10. పోటీ తుది నిర్ణయం సంపాదకుడిదే ఈ విషయమయి ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలూ జరపటం సాధ్యంకాదు. 11 ఫలితాలు 13-10-67 సంచికలో ప్రచురిస్తాము

—సంపాదకుడు